
ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

ఆదివారం | అక్టోబరు 18, 2026 | సంపుటి : 7 | సంచిక : 118 | పేజీలు : 2



2 లో

సరస్వతీ మాత అలంకరణలో

అమ్మవారు

- ఏడో రోజు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ లో ఐటీ టవర్ల ఏర్పాటుకు కృషి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- భద్రకాళి అమ్మవారి రథాన్ని ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే నాయిని..
- పద్మాక్షి, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు





హనుమకొండ, ఆయుధం: వరంగల్, హనుమకొండ నగరాలకు ఐటీ టవర్ల ఏర్పాటు కోసం అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి, రానున్న రోజుల్లో ముందుకు తీసుకెళ్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరంలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భద్రకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ (ఎడిషన్2)ను ప్రారంభించిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి నగరంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. తొలుత శ్రీ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకుని హోమపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. వరంగల్ నగరానికి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పే శ్రీ భద్రకాళి అమ్మవారి రథ నిర్మాణ పనులు పూర్తికావడంతో, ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. మాడవీధుల్లో ఊరేగింపునకు సిద్ధమైన అమ్మవారి రథం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు.

అనంతరం ప్రముఖ శైవక్షేత్రమైన వేయిస్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి వద్ద పూజల్లో పాల్గొన్నారు. వరంగల్ నగరం చారిత్రక కట్టడాలు, ప్రాచీన ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయమని మంత్రి తెలిపారు. ఈ ప్రాంత వారసత్వ సంపదను కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు వరంగల్, హనుమకొండ నగరాల్లో ఐటీ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అధికారులు, ప్రధాన అర్చకులు, పురోహితులు మంత్రికి, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందించారు.



తిరుమల శ్రీవారి సన్నిధి లో

ఎంపీ రవిచంద్ర

వరంగల్, ఆయుధం: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. కలియుగ ఇష్ట దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని తదితర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర భక్తిప్రపత్తులతో స్వామి వారికి తలనీలాలు సమర్పించి తన మొక్కు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తన కుటుంబ సభ్యులతోకలిసి విచ్చేసిన ఎంపీ రవిచంద్రకు వేద పండితులు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆశీర్వచనాలు పలికారు. ఎంపీ రవిచంద్రతో పాటు కుటుంబ సభ్యులు వద్దిరాజు ధీరజ్, వద్దిరాజు ప్రీతమ్, వద్దిరాజు గిరినందన్, జంగిలి రీశ్వన్ రెడ్డి, గంగుల సనవ్, గంగుల సౌరవ్ లు శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలి : ఎంపీ వద్దిరాజు

తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి కరువు కాటకాలు నశించాలని, రాష్ట్రం, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కలియుగ ఇష్ట దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, ఆయురారోగ్యాలతో నిండూనూరేళ్లు వర్ధిల్లాలని స్వామి వారిని ఎంపీ రవిచంద్ర ప్రార్థించారు.



315 మండలాల్లో కరవు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- తక్షణ సాయం అందించాలని కేంద్రానికి వినతి

ఢిల్లీ, ఆయుధం: తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేత్ బచావో అభియాన్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుంచి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను లేవనెత్తారు. మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని కోరారు. ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలన్నారు. రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.





సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా లోని మహిళలందరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా లోని మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఈ పండుగను ప్రజలందరూ ఆసందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో తప్పిదాలపై
జర్నలిస్టుల ఫిర్యాదు

- సమగ్ర విచారణ జరిపించాలని పోలీస్ కమిషనర్‌కు వినతి

హన్మకొండ, ఆయుధం:

ఎస్సీ, ఎస్టీ కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025) విచారణలో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు జర్నలిస్టులు శనివారం ఫిర్యాదు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కింద నమోదైన కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసీపీ నరసింహారావుతో పాటు ఏ ఒక్క పోలీసు అధికారి కూడా తమను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ, 2025 ఆగస్టు 15న ఏసీపీ సమక్షంలో తాము వాంగ్మూలాలు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి వాటిని న్యాయస్థానానికి సమర్పించి కేసును మూసివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇదే విషయంపై విచారణాధికారిగా ఉన్న సంబంధిత ఏసీపీని సంప్రదించడంతో కేసు మూసివేశామని తెలపడంతో ఖంగు తిన్నామని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించడంతో ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు, న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా తీసుకున్న పత్రాలన్నింటినీ సీపీకి అందించారు. ఫిర్యాదును, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత సానుకూలంగా స్పందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన కేసులో బాధితుడు కంకనాల సంతోష్ మరో ఫిర్యాదులో తనకు జరిగిన అన్యాయంపై సీపీకి వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి పొడిచెట్టి విష్ణువర్ధన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, టియుడబ్ల్యూజే రాష్ట్ర బాధ్యులు పి.వేణుమాధవ్, తోట సుధాకర్, బోళ్ల అమర్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోసం భక్తుల దర్శనాలు
నిలిపివేయడం దుర్మార్గం

- ఆలయ సిబ్బంది, పోలీసు యంత్రాంగం అత్యుత్సాహం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



వరంగల్, ఆయుధం: వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సామాన్య భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ మంత్రి రాక సందర్భంగా ముందుగానే సామాన్య భక్తులను గంటల తరబడి నిలిపివేయడం, అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన సామాన్య భక్తులతో పాటు తాను కూడా గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని గంట రవికుమార్ మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు వ్యవస్థ సామాన్య భక్తుల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వారి ఆధ్యాత్మిక భావాలను, ఇబ్బందులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నప్పటికీ, దేవస్థానంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. భక్తులకు తగిన తాగునీటి సౌకర్యాలు లేకపోవడం, సరైన పార్కింగ్ ఏర్పాట్లు చేయకపోవడం, భక్తులు పూజలు నిర్వహించడానికి స్పష్టమైన పూజల పట్టిక, క్రమబద్ధమైన ఏర్పాట్లు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సరస్వతీ అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా దర్శనానికి వచ్చిన చిన్నారులను గంటల తరబడి నిలబెట్టడం అత్యంత బాధాకరమన్నారు. చంటిపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు కనీస తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేదని విమర్శించారు. దేవస్థాన అధికారులు, పోలీసు యంత్రాంగం స్పందించి భక్తులకు నిరంతర తాగునీటి సౌకర్యం, మెరుగైన పార్కింగ్, క్రమబద్ధమైన క్యూ లైన్లు, చిన్నారులు, వృద్ధులు, మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. భక్తుల దర్శన సమయాలను స్పష్టంగా ప్రకటించి, ఎలాంటి రాజకీయ హోదా లేదా అధికార హోదాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమానంగా అమ్మవారి దర్శనం కల్పించాలని కోరారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్ చేశారు.

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జనవరి కోటా విడుదల

తిరుమల, ఆయుధం: వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోటా ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. డిప్ రిజిస్ట్రేషన్ కోసం 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో ఎంపికైన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, పుష్పయాగం టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జనవరి నెల ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.



మురికిగా ఉండే టాయిలెట్ ఫొటో పెడితే..
రూ.1000 రివార్డ్

జాతీయం, ఆయుధం: జాతీయ రహదారుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో టాయిలెట్ల పరిశుభ్రతపైనా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లను గుర్తించి, వాటి ఫొటోలను పంపేవారికి రూ.1000 బహుమతి పొందే అవకాశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కల్పిస్తోంది. అక్టోబర్ 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఇటీవల ప్రకటించింది. జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల్లో మురికిగా ఉండే టాయిలెట్లను గుర్తించేందుకు "క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్" పేరుతో ఓ కార్యక్రమాన్ని ఎన్‌హెచ్ఏఐ ఇటీవల ప్రారంభించింది. అపరిశుభ్రంగా ఉండే మూత్రశాలలు కనిపిస్తే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వాహనదారుడి పేరుతో పాటు లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్‌లను ఇవ్వాలి.

ఇలాంటి సంఘటనను నివేదించే వారికి వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.1000 రివార్డుగా లభిస్తుంది. అయితే, ఇది కేవలం హైవే టోల్‌ప్లాజాల నిర్వహణలో ఉండే టాయిలెట్లకు మాత్రమే వర్తిస్తుందని, పెట్రోల్ బంకులు, దాబాలు, ఇతర ప్రదేశాలకు వర్తించదని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది.

దసరా: ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు



వరంగల్, ఆయుధం: ఉర్సు రంగాలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా ఈనెల 20న మధ్యాహ్నం 03:00 గంటల నుండి 21న ఉదయం 3:00 గంటల వరకు ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ తెలిపారు.

- ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నెలు క్రాస్ నుండి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లవలెను.
- కరీంనగర్ నుండి ఖమ్మం వెళ్ళవలసిన వాహనాలు, కే. యూ. సి, పెద్దమ్మ గడ్డ, హనుమాన్ జంక్షన్, పోచం మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను.
- హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్ళవలసిన వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నెలు క్రాస్ నుండి వెళ్లవలెను.
- ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం క్రింది ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- హన్మకొండ హంటర్ రోడ్ నుండి ఉర్సు గుట్టకు వచ్చే వాహనాలు కొలంబో హాస్పిటల్, బీఆర్ నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్ దగ్గర, *ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం స్కూల్ నందు వాహనాలను పార్కింగ్ చేయాలి.
- కడిపికొండ నుండి వచ్చే వాహనాలు భారత్ పెట్రోల్ పంపు దగ్గర పార్కింగ్ చేయగలరు,
- RTO జంక్షన్ నుండి వచ్చే వాహనాలు, లక్ష్మీ ఫంక్షన్ హాల్ ఒపెన్ ప్లేస్, తాళ్ల పద్మావతి కాలేజ్ దగ్గర పార్కింగ్ చేయగలరు,
- కరీమాబాద్ నుండి వచ్చే వాహనాలు భీరన్న గుడి దగ్గర పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

21 నుంచి ప్రతిభా పాటవ పోటీలు

వరంగల్, ఆయుధం:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ తెలిపారు. ప్రతీ విభాగంలో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనే వారు (తెలుగు/ఇంగ్లీషు/ఉర్దూ బాషలల్లో) (పేపర్ మీద వ్యాసాలు వ్రాసి, ఫోటో తీసి, PDF గా మార్చి, ఈ నెల 24 లోపు ఆన్లైన్ ద్వారా పంపాలన్నారు. వ్యాసం 500 పదాలకు మించకూడదని సూచించారు. Registration link: https://forms.gle/YkeKUscWu5LFYWFH7 కు పంపించాలని అన్నారు. 12 వ తరగతి విద్యార్దుల వరకు నేరాల నివారణలో పోలీసుపారుల పాత్ర, డ్రగ్స్ నిర్వహణ: నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు అనే అంశాలపై రాసి పంపాలన్నారు. అలాగే డిగ్రీ & ఆ పై తరగుతుల వారికి సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై రాసి పంపాలన్నారు.

షార్ట్ ఫిల్మ్స్ పోటీలు

పోలీస్ అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు మూడు నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచి ఈనెల 23 లోపు అందజేయాలి. ఎంపికైన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌లు, రాష్ట్రస్థాయి పోటీలకు డీజీపీ కార్యాలయం, హైదరాబాద్‌కు పంపించబడుతుంది. ఆసక్తి గల వారు తమ ఎంట్రీలను 23వ తేదీ సాయంత్రంలోగా పోలీస్ హెడ్ క్వార్టర్ లో పీఆర్‌వోకు అందించవలెను

ఫోటోగ్రఫీ పోటీలు

పోలీస్ అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు మూడు ఫోటోలు 10×8 అంగుళాల పరిమాణంలో ఈనెల 23 లోపు సమర్పించాలి. ఆర్టికల్స్, ఫీచర్స్(వ్యాసాలు/విశేష వ్యాసాలు/ముఖ్య అంశాలు): పోలీసు త్యాగాలు, పోలీసు సంబంధిత వృత్తిపరమైన కృషి అనే అంశంపై ప్రముఖ రచయితలు, పాత్రికేయులు రాసిన వ్యాసాలు, స్వీకరించి ఈ నెల 21 నుంచి వారం రోజుల పాటు తెలుగు ఇంగ్లీష్, ఉర్దూ వార్తాపత్రికలలో ప్రచురించబడును. ఔత్సాహిక రచయితలు, పాత్రికేయులు రాసిన వ్యాసాలు అక్టోబర్ 19వ తేదీ సాయంత్రంలోగా హన్మకొండ పోలీస్ హెడ్ క్వార్టర్ లో పీఆర్‌వోకు అందించాలన్నారు.



గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ హాజరయ్యారు. వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగను జరుపుకోవాలని గ్రంథాలయ మహిళా ఉద్యోగులకు తెలియజేశారు. అలాగే వారికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రంథాలయ మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులైన అరుణ, లలిత, రజిత, లక్ష్మి, అనిత, స్వరూప, ప్రత్యూష, చిన్నబాబు, గూడ నవీన్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు గూడ రమ్య, స్రవంతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ మాతగా అమ్మవారు

- ఏడో రోజు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, ఆయుధం: వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం అనంతరం అర్చకులు అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. ఈ రోజు అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించడానికి ఉదయం నుండి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. అమ్మవారికి రథసేవ జరిపారు. శరీరాన్ని రథంతో పోలుస్తారు రక్తసేవలో సేమింపబడుతున్న అమ్మవారి రథం లాగితే ఈ జీవనరతం అనేది బాగా సాగుతుందని నమ్మకం అందుకు అనేకమంది భక్తులు పోటీపడుతూ ఈ రథాన్ని లాగారు. నవరాత్ర కల్పాన్ని అనుసరించి కాలరాత్రి మరియు రక్తబీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి పూజారాధనలు జరిపారు. భద్రకాళీ శరణం మమ అనే నామస్మరణతో దేవాలయం మారుమ్రోగింది.

నేడు భద్రకాళి మాత జన్మోత్సవం

ఆదివారం భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, దుర్గ భద్రకాళిగా కోటి యోగినీ గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని అనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. కార్యక్రమాలకు ఉభయదాతలుగా శారదా విద్యా సంస్థలు హైదరాబాదు వారి అధినేతలు సందిపూడి రవిశంకర్ మానస, నాగభూషణం శ్రీదేవి, డా॥ బి.వెంకటేశ్వర్లు సునీత, డా॥ బి.సనత్ కుమార్, డా॥ సాహితి దంపతులు, డా॥ బి.వైష్ణవి, జోశ్యుల కామేశ్వరశర్మ కిరణ్మయి దంపతులు వ్యవహరించారు. అమ్మవారిని తెలంగాణా రాష్ట్ర ఐ.టి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సందర్శించారు. మంత్రివెంట ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, డి.సి.సి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు. ప్రముఖులకు ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. దేవాలయ చైర్మన్ డా॥ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, అంజనీదేవి, సతీష్, శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



పరకాల, ఆయుధం: పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు పరకాల టౌన్, పరకాల, నడి కూడ, ఆత్మకూర్, దామెర మండలాలకు చెందిన 154 మంది నిరుపేద మైనార్టీ మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న కుట్టు మిషన్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మైనారిటీ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రతి ఒక్కరికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆధునిక కుట్టు మిషన్లతో ట్రైనింగ్ ఇప్పించి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేస్తున్నామనీ, అలాగే బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరకాల పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి రూ.2 రెండు కోట్లతో షాది ఖానా పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరిట అందినంత దోచుకుని సంపాదనే ధ్యేయంగా పనిచేశారన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా యోజన, ఈ మోపెడ్ బైక్స్ పథకం రేవంతన్న కా సహారా మిస్కి నోమ్ కే లియో 202425 ద్వారా 100 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల విలువైన ఈ మోపెడ్ బైక్స్ అందిస్తున్నామని అన్నారు. మైనారిటీ స్టడీ సర్కిల్ కెరీర్ కౌన్సిల్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షలలో శిక్షణ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ విలువలను దిగజారుస్తున్న పాలక పార్టీలు

- చట్టసభలకు వన్నెతెచ్చిన ప్రజానాయకుడు ఓంకార్
- అమరజీవి కామ్రేడ్ ఓంకార్ 18వ వర్ధంతి
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



వరంగల్, ఆయుధం: అవినీతి అక్రమాలతో ఇచ్చిన హామీలను విస్మరించి రాజకీయ విలువలను దిగజారుస్తూ పాలక పార్టీలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ ఓంకార్ చూపిన బాటలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఎంసి పి ఐ (యు) వ్యవస్థాపకులు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలో ఓంకార్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అనంతరం పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ.. మోడీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ రాజ్యాంగం పెను ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్నదని హక్కుల పోరాడితే నిర్బంధాన్ని ప్రయోగిస్తూ నియంతృత్వ పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశ్నించడమే నేరంగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగం నిత్యవసర వస్తువుల ధరలు ఆత్మహత్యలు ప్రజా సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి తమ ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో నీతిగా నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన జీవితాన్ని ధారపోసి చట్టసభలకే వన్నె తెచ్చి అసెంబ్లీ టైగర్ గా పేరుగాంచిన అమరజీవి కామ్రేడ్ ఓంకార్ ఆచరణను ఆదర్శాలను త్యాగాలను స్మరించుకొని ప్రజా ఉద్యమాలను నిర్మించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, సింగతి మల్లికార్జున్, డివిజన్ సహాయ కార్యదర్శి రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కేశెట్టి సదానందం, సురేందర్, వెంకటయ్య, సాంబయ్య, రమేష్, రమేష్, కొమురయ్య, సాంబయ్య, కుమారస్వామి, భాస్కర్, పద్మ, బక్కయ్య, రామన్న, రాకేష్, ఏఐసీటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిరిబొమ్మల భాస్కర్, పాల్గొన్నారు.



శ్రీ కనకదుర్గ దేవాలయంలో మహా అన్నదానం

వరంగల్, ఆయుధం: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో 7వ రోజు సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. దాదాపు చాలా మంది మహా అన్నప్రసాదం స్వీకరించినట్లు అన్నారు. లోక కల్యాణం కోసం కనకదుర్గ దేవాలయంలో చండీ హోమం ప్రత్యేక పూజలు అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సర్వరియా, సురేష్ కుమార్, వేణు, సింగరికొండ వెంకటేశ్వర్లు, కొప్పుల సరోజన, కొంక వెంకటేశ్వరరావు, జంగం ప్రభాకర్, గూడ శారద, అర్చకులు నాని శర్మ, వంశీ శర్మ, రాజారామ్ శర్మ, రాఘవేంద్ర శర్మ భక్తులు పాల్గొన్నారు.



మద్ది కాయల ఓంకార్ కు ఘన నివాళి

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని అబ్బని కుంట తెలంగాణ రైతు భవనంలో సంఘ కమిటీ ఆధ్వర్యంలో ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ మద్ది కాయల ఓంకార్ జీవితం రైతాంగ ఉద్యమాలు నిర్మించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేల ఎకరాల వ్యవసాయానికి సాగు చేసుకునే విధంగా రైతాంగానికి పోడు భూములు పంచి సాగులోకి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి సిర్ల రవీందర్, సంఘ ఉపాధ్యక్షులు ఊరటి హంసల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోకిడ పీరయ్య, సోమిడి సాంబయ్య, బి.రవీందర్, పి.పైడి పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధన సమితి
జిల్లా నూతన కమిటీ

వరంగల్, ఆయుధం: బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా రెండవ మహాసభలు అక్టోబర్ 16న విజయవంతంగా ముగిశాయి. మహాసభలో ఎంపిక చేసిన 65 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు ప్రకటించారు. అధ్యక్షులుగా చెలుకల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గజవెల్లి అనుప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా చింతకింది కుమారస్వామి, కోశాధికారిగా చిట్యాల సువర్ణ, ఉపాధ్యక్షులుగా బైరి తిరుపతి, రావుల అనిల్ కుమార్, ఆరెల్లి ప్రభాకర్, కడియాల మనోహర్, దేశబోయిన ఉపేందర్, బండ్లోజు నరసింహ చారి, నల్ల తీగల కుమార్, మునిగాల సత్యనారాయణ, ఏనుగు శైలజ, పరికరాల రమేష్, అల్లాడి నరసయ్య, సల్లూరి నరేందర్, పాము మనోహర్, ఎండి.జాఫర్, మచ్చ రమేష్, గొల్లపల్లి సదా, శ్రీను పుల్లూరి కుమారస్వామి, జున్ను మణెమ్మ, సహాయకార్యదర్శులుగా చీకటి ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, మచ్చ కుమారస్వామి, పుల్ల ఎల్లగౌడ్, పేరువారం రవీందర్, జున్న రాజు, జున్న సాంబయ్య, కుల్లా రాకేష్, మల్యాల దేవేందర్, ఆకోజు సాంబయ్య, విజయలక్ష్మి, కళ్యాణి, శ్రీధర్, రాములు, యాదగిరి, వీరబ్రహ్మం, రామ్మూర్తి, పెద్దూరి నాగరాజు, బక్కం రాజు, సోషల్ మీడియా కన్వీనర్ మచ్చ రమేష్, అధికార ప్రతినిధులుగా మెరుగు రంజిత్ గౌడ్, ఆరె రాజు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు బతుకమ్మ అలంకరణ పోటీలు

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని రంగసాయిపేట ప్రాంతంలో గల బెస్తం చెరువు వద్ద ఆదివారం సద్దుల బతుకమ్మ సందర్భంగా కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నామని కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు తెలిపారు. ఈ బతుకమ్మ పోటీల సెలక్షన్ కమిటీ గా కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, తెలుగు రవికుమార్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, మానుపాటి వెంకటేష్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీ ప్రకటన రద్దు

- నోడల్ అధికారి డాక్టర్ సునీత

ములుగు, ఆయుధం: ములుగు జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ పోస్టులను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 16న జారీ చేసిన నియామక ప్రకటనను కొన్ని పరిపాలనా కారణాలతో ఈ నెల 17వ తేదీన తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎంపిక కమిటీ నోడల్ అధికారి డాక్టర్ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నియామక ప్రకటనను తాత్కాలికంగా రద్దు చేసినందున గతంలో ప్రకటించిన దరఖాస్తుల స్వీకరణ షెడ్యూల్ అమలులో ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పాత ప్రకటన ఆధారంగా స్వయంగా గానీ, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గానీ దరఖాస్తులు సమర్పించవద్దని సూచించారు. అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిపాలనా ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియను తిరిగి చేపట్టనున్నట్లు తెలిపారు. పోస్టుల వివరాలు, వేతనాలు, విద్యార్హతలు, వయోపరిమితి, దరఖాస్తుల స్వీకరణ తేదీలు, ఎంపిక విధానం, ఇతర నిబంధనలను కొత్త అధికారిక ప్రకటన ద్వారా తెలియజేయనున్నట్లు ఆ ప్రకటనలో ఆయుష్ నోడల్ అధికారి సునీత పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రోడ్డున పడేసిన ప్రభుత్వం

- 5వ రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె
- మద్దతు ప్రకటించిన బీజేపీ నేతలు



వరంగల్, ఆయుధం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై వరంగల్ పోచంమైదాన్ కూడలిలో ఐదవ రోజుకు చేరిన నిరవధిక సమ్మెకు వారు హాజరై, బీజేపీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ... కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన కోవిడ్ వారియర్స్, ఎన్ హెచ్ ఎం వైద్యులు మరియు సిబ్బందిని నేడు తమ భవిష్యత్తు కోసం రోడ్డు పైకి లాగి నిరవధిక సమ్మె చేసేలా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని మండిపడ్డారు. 'ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన' అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం, 17,000 మంది కుటుంబాల పొట్టగొడుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ... ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు మరియు వారి రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రభుత్వం కింద పేర్కొన్న న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యోగులు చేస్తున్న ఈ న్యాయపోరాటానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించి చర్చలు జరపకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, దేశాయిపేట మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సంగెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్, బిజెపి నాయకులు మల్లికార్జున్, ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు, వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

రంజీ బరిలో శుభ్‌మన్ గిల్

జాతీయం, ఆయుధం: మరో ఐదు రోజుల్లోనే న్యూజిలాండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. కివీస్‌తో తొలుత టీ20 సిరీస్‌ను ఆడనుంది. ఆ తర్వాత వన్డేలు, టెస్టుల్లో తలపడనుంది. అక్టోబర్ 22 నుంచి పొట్టి సిరీస్ మొదలవుతుంది. ఇక వన్డేలు నవంబర్ 4వ తేదీన ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి దాదాపు రెండు వారాలపాటు భారత వన్డే, టెస్టు జట్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఖాళీనే. ఈ క్రమంలో కీలక నిర్ణయం తీసుకున్నాడు. రంజీ ట్రోఫీ (Ranji Trophy) బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం నుంచి రెండో రౌండ్ ప్రారంభం కానుంది. ఛత్తీస్‌గఢ్‌పై పంజాబ్ జట్టు తరపున గిల్ ఆడనున్నాడు. కివీస్‌తో రెండు టెస్టుల సిరీస్ నేపథ్యంలో ప్రాక్టీస్ కోసం రంజీ మ్యాచ్‌ను వినియోగించుకోవాలని భావిస్తున్నాడు.

ఐదుగురిని వ్యక్తిగత నెట్ బౌలర్లుగా..

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు భారత్ చేరుకోవాలంటే న్యూజిలాండ్ (India vs Newzealand) సిరీస్ అత్యంత కీలకం. రెండు టెస్టుల్లోనూ కివీస్ పేస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు కెప్టెన్ గిల్ (Shubman Gill) మంచి ఆలోచన చేశాడు. గతంలో ఏ భారత సారథి కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. తన కోసం ఐదుగురిని వ్యక్తిగత నెట్ బౌలర్లుగా న్యూజిలాండ్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అందుకు అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు సమాచారం. ఇప్పటికే బీసీసీఐ పలువురిని నెట్ బౌలర్లుగా పంపించనుంది. వారితోపాటు అదనంగా తీసుకెళ్లనున్నాడు. టెస్టు సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ A జట్టుతో భారత్ A ప్రాక్టీస్ మ్యాచ్‌ను ఆడనుంది. వన్డే సిరీస్ నేపథ్యంలో గిల్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో టెస్టు సిరీస్‌కు నెట్ బౌలర్ల సాయంతో సన్నద్ధం కావాలని గిల్ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

చౌటుప్పల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, ఆయుధం: దసరా పండగ నేపథ్యంలో నగర ప్రజలు సొంతూళ్లకు బయల్దేరి వెళ్తున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ తదితర బస్టాండ్లలో రద్దీ నెలకొంది. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై నల్గొండ జిల్లా చిట్యాల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిట్యాల వద్ద కొత్తగా ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. దీనిపనుల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చౌటుప్పల్, బొర్రలగూడెం వద్ద వాహనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. గంటసేపటి నుంచి విజయవాడ హైవేపై వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. పోలీసులు, హైవే సిబ్బంది ట్రాఫిక్‌జామ్‌ను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌హనుమకొండ రహదారిపై కూడా భారీగా వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695